క్లుప్తంగా

గంగమ్మతల్లికి చందన అలంకరణ



చందన అలంకరణలో పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

ఒంగోలు మెట్రో: నగరంలోని గద్దలగుంటపాలెంలో గంగమ్మతల్లికి నిర్వహిస్తున్న వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ అర్చకుడు ప్రసాదుశర్మ విశేష ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, పన్నీరు, పాలు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీ సూక్తంతో అమ్మవారిని అభిషేకించారు. గంగమ్మతల్లికి చందన అలంకరణతో అష్టోత్తర శతనామావళి కుంకుమ పూజ నిర్వహించి పంచహారతులతో భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మంత్రపుష్పం తీర్థ ప్రసాదాలతో భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి మహోత్సవాలు



చందన అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఒంగోలు మెట్రో: వైశాఖమాసం హనుమజ్జయంతి మహోత్సవాలలో భాగంగా స్థానిక గద్దలగుంటపాలెం రాజాపానగల్ రోడ్డులో గల సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం మూడో రోజు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెరంబదూర్ హరికృష్ణ వైఖానస ఆగమోక్తముగా ఉదయం ఆరు గంటలకు సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామికి మన్యసూక్తంతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక చందన అలంకరణతో ధూపదీప హారతులతో అర్చనాది కార్యక్రమాలు నిర్వహించారు. ప్రదోషకాలంలో అష్టోత్తర శతనామావళి, లక్ష తమలపాకులతో, లక్ష మల్లెపూలతో అర్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, భక్తులచే శ్రీరామ నామసంకీర్తనం నిర్వహించారు. ఈ పూజ క్రతువులో నగర డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) దంపతులు పాల్గొని స్వామివారికి చందన అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఈదుపల్లి దశరథ రామారావు, భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో మరొకరు మృతి

కనిగిరి రూరల్: ఇటీవల వేటపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మరొకరు ఆదివారం మృతి చెందారు. ఈనెల 23న గురువారం బాపట్ల నుంచి కారులో తిరిగి కనిగిరికి తిరిగి వస్తుండగా వేటపాలెం వద్ద రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ఉన్న కనిగిరి పాతూరు ఎస్సీ కాలనీకి చెందిన మన్నెపల్లి గ్లోరి(27) అక్కడికక్కడే చనిపోగా, తీవ్ర గాయాలపాలై నాలుగు రోజులగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భర్త మన్నెపల్లి టెండుల్కర్ (29) ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కనిగిరి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

ఒంటరై.. తల్లడిల్లుతున్న మాతృహృదయం

కమలాకర్, ఎలిజిబెత్ దంపతులకు మన్నేపల్లి టెండుల్కర్ ఒక్కడే సంతానం. విశ్రాంత ఉద్యోగి అయిన తండ్రి కమలాకర్ ఏడాది క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. టెండుల్కర్‌కు బాపట్లకు చెందిన గ్లోరితో మూడేళ్ల క్రితమే వివాహమైంది. ఎంతో ఆనందంగా సాగుతున్న కుటుంబాన్ని మృత్యువు కబళించి చిన్నాభిన్నం చేసింది. ఏడాది క్రితం భర్త చనిపోగా, నాలుగు రోజుల వ్యవధిలో కుమారుడు, కోడలు మరణించడంతో... వృద్ధురాలైన తల్లి ఎలిజిబెత్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు సిద్ధం అవుతున్నాయి. పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు ఇండెంట్‌లు అందించారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికి సిద్ధం చేస్తున్నామని ఎంఈవో ఇందిరాప్రసాద్ ఆదివారం తెలిపారు.



పునాది దశలోనే నిలిచిపోయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం



కరవది రైల్వేస్టేషన్ భవనం



ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలి బాట

సమస్యల కూత..!

- కరవది రైల్వేస్టేషన్‌లో కనీస వసతులు కరువు
- తాగునీటి సమస్య, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం, ప్లాట్‌ఫాం పగుళ్లతో ప్రయాణికులకు అవస్థలు
- సాయంత్రం 6 గంటల తర్వాత మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ప్యాసింజర్ రైలును తిరిగి ప్రారంభించాలని కోరుతున్న ఒంగోలు రూరల్ ప్రజలు

ఒంగోలు రూరల్:

ఒంగోలు మండలంలోని కరవది రైల్వేస్టేషన్‌లో సమస్యలు కూతపెడుతున్నాయి. 1901వ సంవత్సరంలో బ్రిటీష్ వారిచే నిర్మించబడి ఒక వెలుగు వెలిగిన ఈ రైల్వేస్టేషన్ ప్రస్తుతం కళావిహీనంగా మారింది. ఒంగోలు నగరంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలకు, క్వార్టర్స్‌కు కాంట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేయడాన్ని రైల్వేశాఖ ప్రారంభించిన అనంతరం కరవది పంప్ హౌస్‌ను, పైపులైన్‌ను నిలిపివేశారు. నలుగురు సిబ్బందిని కూడా తొలగించారు. పంప్ హౌస్ మూసివేయడం వలన కరవది ప్లాట్‌ఫాంలు, బాత్ రూంలకు నీటి సరఫరా నిలిచిపోయి అక్కడి నీటి సరఫరా వ్యవస్థ మొత్తం నిరుపయోగంగా మారింది. దీనిపై ప్రయాణికుల సంఘం వారు రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాయగా ఒక బోర్ వెల్ వేశారు. కానీ, ఆ బోర్ నుంచి ఉప్పు నీరు వస్తుండటంతో తాగేందుకు పనికి రావడం లేదు. ప్లాట్ ఫాంలను కూడా నాసిరకంగా నిర్మించడంతో నిలువునా పగిలి పాములకు ఆవాసంగా మారాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ఒక ప్లాట్‌ఫాం మీద నుంచి మరో ప్లాట్‌ఫాం మీదకు రావాలంటే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు, ఆరోగ్యం బాగాలేని వారు నరకం చూస్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు పునాదులు తీసి అధికారులు వచ్చే సమయంలో హడావిడి చేశారు. సదరు కాంట్రాక్టర్ తెచ్చిన నాసిరకం సిమెంట్‌ను స్టేషన్లోనే వేయడం వలన ప్రతి ట్రైన్ వెళ్లే సమయంలో దుమ్ము రేగి రైల్వే సిబ్బంది, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఐదు నెలలుగా ప్రైవేట్ కాంట్రాక్టర్ సిమెంట్‌ను స్టేషన్ ఆవరణలో ఉంచడం రైల్వే సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. గతంలో విజయవాడ వైపు ఆరు ప్యాసింజర్ రైళ్లు ఉండేవి. ప్రస్తుతం నాలుగు మాత్రమే నడుస్తున్నాయి. చెన్నై వైపు కూడా గతంలో ఆరు రైళ్లు నడిచేవి. ప్రస్తుతం మూడే నడుస్తున్నాయి. ప్యాసింజర్ రైళ్ల సంఖ్య తగ్గిపోవడంతో రైల్వేస్టేషన్ ఆదాయం కూడా పడిపోయింది. గతంలో రైల్వేస్టేషన్ నెలవారీ ఆదాయం రూ.1,40,000 ఉండేది. నేడు ఆ ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఉదయం, రాత్రి ఆర్టీసీ వారు స్టేషన్ లోపల వరకు బస్సులు నడిపేవార. తీరప్రాంతాల ప్రజలకు అనుకూలంగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అందువలన రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని రైల్వే అధికారులను ఒంగోలు మండలంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక, రాత్రయితే రైల్వేస్టేషన్‌లో ఆకతాయిల బెడద అధికంగా ఉంటోంది. సాయంత్రం ఆరు దాటగానే మందుబాబులు తిష్టవేస్తున్నారు. గతంలో ఇద్దరు ఆర్‌పీఎఫ్ సిబ్బంది రాత్రివేళ డ్యూటీలో ఉండి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టేవారు. ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులకు భరోసా కల్పించే వారు కరువయ్యారు. ఒకటి నుంచి నాలుగు ప్లాట్‌ఫాంలపైనా ఎండకు, వానకు రూఫ్ లేకపోవడంతో పగటి వేళ ఎండతో పాటు వర్షాలకు ప్రయాణికులు అవస్థపడుతున్నారు. ప్రతి ప్లాట్ ఫాంపై రూఫ్ నిర్మించి తాగు నీరు, వాడుకనీటి వసతి కల్పించాలని, లైట్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి కాంట్రాక్టర్ ఉంచిన సిమెంటు బస్తాలు



పగిలిపోయిన ప్లాట్‌ఫాం



నీటి సరఫరా నిలిచిపోయి నిరుపయోగంగా ఉన్న ట్యాప్‌లు



మూతబడిన పంప్ హౌస్

వీధి కుక్కల స్వైర విహారం

- ప్రజలపై దాడి చేస్తుండటంతో బెంబేలు

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రజలపై దాడిచేసి గాయపరచడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. స్థానికులు సచివాలయ సిబ్బందికి తెలియజేసినప్పటికీ ఎలక్షన్ కోడ్ ఉందంటూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతిరోజూ డాగ్ బైట్ కేసులు ఉంటున్నాయని కరవది పీహెచ్‌సీ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ కూడా తెలిపారు. మూడు రోజుల క్రితం చేజర్లకు చెందిన జి.కోటయ్యను పానకాలపాలెంలోని వడ్డెపాలెంలో పది కుక్కలకుపైగా ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. అతను ఏకంగా స్పృహ కూడా కోల్పోగా, పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టి అటవీ ప్రాంతాలకు తరలించి వాటి బారి నుంచి ప్రజలను కాపాడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కుక్క కాటుతో ఓ వ్యక్తి కాలికి అయిన గాయం



అంబులెన్స్‌లో చికిత్స చేస్తున్న సిబ్బంది



కుక్క కాటు బాధితుడు

గరుడ వాహనంపై దర్శనం ఇచ్చిన వేణుగోపాలుడు

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రాముఖ్యత కలిగిన గరుడ సేవ సందర్భంగా దేవాలయంలో నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగా భవానీ అమ్మవారు

తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు బాలరాజు, కామేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ కార్తీక్ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఈ నెల 28వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు అమ్మవారి ఆలయంలో సామూహిక సుమంగళి పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఈఓ కార్తీక్ తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు సోమవారం ఆలయ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి నృత్య పోటీల్లో అవార్డులు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో చందు డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: చిలకలూరిపేటలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు కళానిలయం సంస్థ వారు నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య పోటీల్లో ఒంగోలుకు చెందిన చందూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు అత్యధికంగా 13 అవార్డులు సాధించారు. నృత్య దర్శకుడు టి.చందూ, పిల్లలను నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కళామిత్ర మండలి జాతీయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, డా.రామచంద్రుని రమేష్ కృష్ణ, అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ సుబ్బారావు, నూకతోటి శరత్‌బాబు, కోవెలకుంట్ల బాలకోటయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

జయహో లక్ష్మీనారసింహ



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



హోమం చేస్తున్న అర్చకులు

- వేడుకగా సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో ద్వాదశ 12వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీనారసింహస్వామి కల్యాణం భక్తుల జయజయ ధ్వానాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి గ్రామానికి చెందిన పలువురు దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమం ఉంటుందని అలాగే జూన్ 1వ తేదీ వరకు శ్రీరామసప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వేముల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

35 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒంగోలు నేతాజీ కాలనీలోని చైతన్య స్కూల్లో కలుసుకున్నారు. వారంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విజయవాడ, ఒంగోలు, హైదరాబాద్, బెంగళూరు, తదితర ప్రాంతాల్లో స్థిరపడి వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలలో ఉన్న వారంతా కలుసుకుని సరదాగా గడిపారు. ప్రస్తుతం వారి కుటుంబ పరిస్థితులు, కష్టనష్టాలను పంచుకున్నారు. చదువుకునే రోజుల్లో వారి అల్లరి చేష్టలు, ఆటపాటలను గుర్తుచేసుకుని మురిసిపోయారు. పూర్వ విద్యార్థులు ముప్పవరపు వీరయ్య చౌదరి, శ్రీనివాసులరెడ్డి, శ్రీనాథ్, వాసుబాబు, రమేష్, గఫూర్, హనుమంతరావు, శ్రీధర్, సింగయ్య, పుల్లా వెంకటరావు, వీరగంధం శ్రీలక్ష్మి, లక్ష్మీప్రసన్న, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆనాటి తమ గురువులను సన్మానించుకున్నారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను అమ్మవారికి అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న నాగమయ్య శిలలకు, నాగమయ్య పుట్టకు పాలుపోసి ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ దాసరి వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.